

# దొంగ నిజాయితీ

– పొన్నాడ సత్యప్రకాశరావు

సమయం సాయంత్రం ఆరు దాటుతోంది...

ఆఫీసులోంచి బయటపడదాం అనుకునేసరికి బాస్ పిలుస్తున్నాడంటూ ప్యూన్ కబురు...

వాడి మొహంలో ఆనందం... ఎందుకంటె బాస్ ఎనిమిది దాటితేగాని వెళ్ళడు... అప్పటిదాకా వాడుండక తప్పదు... ఆరింటికి బాస్ మమ్మల్ని పిలిస్తే వాడికి సంతోషం. మరో పావుగంటలో బాసును వదిలించుకుని బయటపడ్డాను.

బస్సు దొరికి ఇల్లు చేరేసరికి ఏడు దాటింది.

టి.వి. చూస్తున్న పిల్లలు నన్ను చూడగానే హోంవర్కు మొదలుపెట్టారు... స్నానం చేసి కిచెన్‌లోకి అడుగుపెట్టాను... గ్యాస్ స్టవ్ వెలిగించబోయేసరికి సిలెండర్ కనబడలేదు... ఖాళీ సిలెండర్ పెట్టే చోట చూశా... ఖాళీ సిలెండర్ అక్కడే వుంది... సిలెండర్ ఏమయినట్లు? ఇల్లంతా చూశాను... ఎక్కడా కనబడలేదు... గుండె జారిపోయింది.

"గ్యాస్ సిలెండర్ ఏమయిందిరా ప్రశాంత్" అరిచాను.

"ఇందాక గోపాల్ అంకుల్ వచ్చారు మమ్మీ! డాడీ మన సిలెండర్ తీసుకెళ్ళమన్నారుట" పన్నెండేళ్ళ ప్రశాంత్ జవాబు...

"గోపాల్ అంకుల్ ఎవ్రా?" నాకు మతిపోతోంది.

"అబ్బ! డాడీ కోసం నిన్న సాయంత్రం వచ్చారని చెప్పాం కదా మమ్మీ! ఆయనే!" ఎనిమిదేళ్ళ పావని అందింపు అన్నకు సమర్థింపుగా.

నా మనసేదో కీడు శంకిస్తోంది... నిన్న రాత్రి పిల్లల మాటలు గుర్తుకు వచ్చాయి.

"మమ్మీ! ఎవరో గోపాల్ అంకులట! డాడీ కోసం వచ్చేరు... లేరని చెప్పాం... మంచినీళ్ళు అడిగి తాగి వెళ్ళిపోయారు... రేపొస్తానంటూ"

నిన్న అంతగా పట్టించుకోలేదు ఆ మాటలని. ఆయన ఫ్రెండ్ ఎవరో అయ్యుంటారు. ఫ్రెండ్స్ కేం తక్కువ. కాని మోసం జరిగినట్లనిపిస్తోంది. పిల్లలని రెట్టించి అడిగాను.

ఆ సదరు గోపాలం అంకుల్ డ్రాయింగ్ రూములో అయిదు నిముషాలు కూర్చొని మేం రోజూ ఎన్ని గంటలకు వస్తామో కనుక్కొని మంచినీళ్ళు తాగి వెళ్ళాడట.

పరాయి వాళ్ళని తొందరగా ఇంట్లోకి రానీయొద్దని ఎన్నిసార్లు చెప్పానురా మీకు అంటూ చెరో రెండు వడ్డించాను. వాళ్ళు బిక్కమొహం వేశారు.

తలుపు తీసుకుని వరండాలోకి వచ్చాను.

అది కొత్తగా కట్టిన ఎపార్ట్‌మెంట్. అద్దె కొంపల్లో మన చావు కూడా మనల్ని చావనివ్వరని వున్నదంతా ఊడ్చి ఎలిజిబిలిటీ వున్న లోన్లన్నీ తీసుకుని ఓ ఆర్నెల్ల క్రితమే ఇందులోకి చేరాం. ఇందులో మన చావు మనం హాయిగా చావొచ్చు... నిజంగా ఏడ్పి చచ్చినా ఎవరూ పట్టించుకోరు. ఎదుటి ఫ్లాట్ వనజగారి కాలింగ్ బెల్ కొట్టాను..

విషయం తెలుసుకుని "అయ్యో! అలాగా!? పోనీ మీకు తెలియని మీవారి ఫ్రెండ్ ఎవరన్నా వచ్చారేమో... ఆయనొచ్చేదాకా కంగారు పడకండి" అన్నారావిడ ఎంతో ఫార్మల్‌గా.

"యస్ ఆంటీ" 'గళ్ళచొక్కా అంకుల్ రిక్షాలో సిలెండర్ తీసుకెళ్ళడం చూసాం" అన్నాడామె కొడుకు... ఇంకా ఏదో అనబోయాడు కాని ఆమె కన్నెర్ర చెయ్యటంతో మాట మింగేసాడు... అయితే సిలెండర్ బయటకి వెళ్ళడం వీళ్ళు చూసారన్నమాట! పెద్దవాళ్ళు లేనప్పుడు ఇంట్లోని వస్తువు బయటకు వెడుతున్నప్పుడు పిల్లలని ఎవరు? ఏమిటీ? అని విచారిద్దామన్న ఐడియా రాలేదో... మనకెందుకులే అని ఊరుకున్నారో అర్థంకాలేదు... ఎవర్నని ఏం లాభం? ఆయనొచ్చేదాకా ఆగాలి... ముందర వంట చెయ్యాలి... స్పేర్ సిలెండర్ ఖాళీ... అదే చెబితే... ఏ కళనున్నారో ఏమో వాళ్ళ స్పేరు సిలెండర్ ఇచ్చారు వనజగారు... బహుశా గిల్టీగా ఫీలయ్యారేమో!?? వంట చేస్తూ ఆయన కోసం ఎదురుచూడసాగాను...

మగమహారాజా! ఆఫీసు నుంచి తిన్నగా ఇంటికి రాకుండా ఫ్రెండ్స్ వచ్చి ఏ పేపరో, పుస్తకమో పట్టుకు కూర్చుంటారు... ఇద్దరం పనిచేస్తున్నా... సమానంగానే సంపాదిస్తున్నా ఆడది ఆడే... వంటిల్లు ఆవిడే. ఉదయం తొమ్మిదింటికి బయటపడతాం... సాయంత్రం ఏడు దాటాక గాని ఇల్లు చేరం... పిల్లలు అయిదింటికల్లా వచ్చేస్తారు... వంటా వార్పు చేసి వెళ్ళాలి... ఆఫీసులో పని... టెన్షన్... అడ్డమైన వాళ్ళ ఫోజులు, మాటలు భరించాలి... మళ్ళీ ఇంటికి రాగానే పని... హాయిగా

ఇంట్లో కూర్చోవాలనే వుంటుందిగానీ... చూస్తూ... చూస్తూ... నెలకు నాలుగు వేల సంపాదనని ఎలా వదులుకోవడం? ఈ అపార్ట్‌మెంట్, కలర్ టి.వి., ఫ్రిజ్, స్కూటర్లు ఒక్క జీతంతో అమరేవా? అన్నీ సమకూర్చుకున్నా ఏదో వెలితి... కొరతే... ఆలోచనల్లోంచి ఉలిక్కిపడ్డాను ఓమారు... అవునూ! ఈ గోపాలంగాడు ఒక్క సిలెండర్‌తోనే సరిపెట్టాడా? ఇంకా వేటిపైనో చెయ్యి వేశాడా? అదురుతున్న గుండెలతో బీరువా తీసాను... చీటీ డబ్బు... పది వేలు అలాగే వున్నాయి. టేప్‌రికార్డర్... మిగతా వస్తువులు కూడా ఎక్కడివక్కడే వున్నాయి... అతను నిజంగా దొంగ కాదేమో! ఆయనొస్తే గానీ తెలియదు. ..

ఇంతలోఓ కాలింగ్ బెల్... ఆయనొచ్చారు...

కాఫీ ఇస్తూ గోపాలం ఫ్రెండ్, సిలెండర్ విషయం చెబితే తెల్లమొహం వేశారు... నిన్ననే గోపాలం సంగతి ఎందుకు చెప్పలేదని చిందులు త్రొక్కారు.

ఒకవేళ నిన్ననే చెప్పింటే... ఎవరో మళ్ళా వస్తారులే. అప్పుడే చూద్దాం అనేవారే!

సిలెండర్ దొంగతనం జరిగిందని నిర్ధారించుకున్నాం...

గ్యాస్ కంపెనీకి ఈ విషయం చెబితే పోలీసు కంప్లైంట్ ఇచ్చి... సిలెండర్ దొరకలేదని సర్టిఫికెట్ తెస్తే ఇంకో సిలెండర్ ఇస్తామన్నారు.

కంప్లైంట్ వ్రాసుకుని... ఆరు నెలలు పోయాక కనబడితే సిలెండర్ దొరకలేదని సర్టిఫికెట్ ఇస్తామన్నారు రక్షణ శాఖవారు కనీసం వెతుకుతాం అని కూడా అనకుండా!అంతకాలం స్పేరు సిలెండర్ లేకుండా వుండడం చాలా కష్టం... సిలెండర్ వెంటనే వచ్చే ఏర్పాటు చేస్తానన్నాడు ఓ ఫ్రెండ్ ఓ మూడు వేలు కావనుకుంటే!

ఇప్పటి వరకు సంపాదనంతా 'ఇంటి' మీదనే పెట్టాం... 'వంటి' మీద కేదైనా వస్తువు చేయించుకుందామనుకుని పాడిన పాట డబ్బుల్లోంచి మూడు వేలు తీయాలంటే ప్రాణం ఉసూరుమనిపిస్తోంది. తప్పదు మరి!

"పిల్లల్నేం చెయ్యకుండా, వేరే వస్తువులేవీ ముట్టుకోకుండా కేవలం సిలెండర్‌తోనే సరిపెట్టినందుకు సంతోషించమన్నారంతా".

కానీ ఎలా? నష్టం నష్టమే కదా!

ఈ మధ్య డాక్టర్లలా స్పెషలైజ్‌డ్ దొంగలు బయలుదేరారు... ఆ మధ్య బాల్కనీలో వేసిన చీరెలు మాత్రం మాయమయ్యాయి... ప్యాంట్స్ అలాగే వున్నాయి. ఇదివరలో క్రింది పోర్షన్‌లో టేప్‌రికార్డర్ ఒక్కటే పోయిందట... ఏది దొరికితే అది పట్టికెళ్ళే 'జనరల్' దొంగలు కూడా వున్నారు... ఇలాంటివి సాధారణంగా పట్టపగలే జరుగుతూ వుంటాయి... ఎవరో ఒకరు చూడడం కూడా జరుగుతూ వుంటుంది. మనకెందుకులే అనే ఉదాసీనత... కృత్రిమమైన అరిస్టోక్రసీ మిడిల్ క్లాసులో ఎక్కువవుతోంది. ఈ మిడిల్ క్లాసుని దోచుకోవడం చాలా తేలిక... ఎందుకంటె గట్టిగా అరవడానికి కూడా ఆలోచిస్తారు... అప్పర్ క్లాసుని దోచుకున్నా తట్టుకోగలరు... తేరుకోగలరు... లోయర్ క్లాసులో ఇలాంటివి జరగవు. జరిగితే అందరూ కలిసిపోతారు... అనుమానమున్నవాడిని చావగొడతారు..

అసలు దొంగతనాలకి... దారిద్ర్యం... ఆకలి కారణమంటారు... కాని పట్టెడన్నం మాత్రం దొంగిలించే దొంగలు కనబడరేం? అవి వెనుకటి రోజులు... 'దొంగతనానికి' కూడా ఓ 'అర్థం' వున్న రోజులవి. ఇప్పుడు కేవలం ఒళ్ళు బలిసి, బలిసిన ఒళ్ళుని ఆలవనియ్యలేక ... 'సులభంగా అర్థం', (ఈజీ మనీ) మెంటాలిటీతో అడ్డదారులు త్రొక్కుతున్నారు.

"మమ్మీ ఆకలేస్తోందే" పావని కేకతో ఆలోచనల్లోంచి బయటపడి కిచెన్‌లోకి నడిచాను... అయితే

మరేమీ ముట్టుకోని ఆ సిలెండర్ల "దొంగ నిజాయితీ"కి సంతోషించాలో, 'వంటింటి' వస్తువుకై 'వంటి' మీద వస్తువు కొనడాన్ని వాయిదా వెయ్యవలసి వచ్చినందుకు ఏడవాలో అర్థంకాలేదు...

●

## శునక ముని



ప్రేమ ఎక్కడికైనా ప్రవహిస్తుంది
ఆరు రుతువుల్లోకి
నదుల్లోకీ ఊళ్ళలోకీ
పెట్టుకున్న పేర్లలోకి కూడా.
ప్రేమ ప్రేమను ఆశిస్తుంది
కుక్క పిల్ల కూడా ప్రేమిస్తుంది
మాకుందో 'టీని'
ఆరేళ్ళ శునకముని
మా మాటల్ని భారతంలా వినే మౌని.
బలవంత శాకాహారానికి అలవాటు పడి
స్వేచ్ఛాప్రణయాన్ని వీధుల్లో వదిలేసి
మౌనిగా, మునిగా నిరంతర తపో సమాధిలో ఉంటు
నిశ్శబ్దంలోంచి చీల్చుకు వచ్చే అపరిచిత శబ్దాలను
అరుపులతో సూచిస్తూ నిషేధిస్తూ
స్నేహాతిశయాన్ని తోక మీద ఆడిస్తూ
ఎప్పుడూ యజమానుల ఆగమనాన్ని నిరీక్షిస్తూ
వియోగానంతర సమాగమాన్ని
ఆనందంగా అనుభవిస్తూ
రోమహర్షణుడిలా
కళ్ళనిండా వెయ్యి నక్షత్రాలు నింపుకొని
ఆపాదమస్తకమూ తడిమి చూసే
పరమముని పామరేనియన్ టీని
ప్రేమ ఎక్కడికైనా ప్రవహిస్తుంది
మనుషుల్లోకీ మానుల్లోకీ.
మనం పెంచుకునే ముద్దుల పిల్లల్లోకీ
మునిలా విశ్వాస తపస్సు చేసే
ముద్దుల పెంపుడు జీవాల్లోకీ.........
ప్రేమ ప్రేమను ఆశిస్తుంది.

—డాక్టర్ ఆర్వీయస్ సుందరం




## "తప్పక" చూడండి!

"అంతంత దూరాలు పోలేక దగ్గర హాల్లోనే సినిమాలు చూస్తాం. ఏటో 'తప్పక' చూస్తాం-"

అంటూ చెప్పబోతోంది ఇంటికొచ్చిన చుట్టాలతో భార్య-

"హాలువాడు కూడా తప్పకచూడండి! అనే ఎడ్వర్టైజ్ చేస్తాడు" - మధ్యలో అందుకొన్నాడు భర్త...

—చంద్రుడు, రాజమండ్రి